# 4. ప్రియురాలు

కొత్తగా నాకు ఆ వూరికి బదిలీ అవటమూ, మా ఆవిడకు కనే నెలలు దగ్గర పడటం మూలానా ముందుగా ఒక్కణ్నే ఇంటెడు సామానూ వేసుకొని బయలుదేరాను. మళ్లీ మా ఆవిడ బిడ్డ నెత్తుకొని వచ్చేప్పటికి ఎల్లాగూ పెద్ద ఇల్లు అవసరం వుంటుందనే ఉద్దేశంతో, కుటుంబానికి సరిపడ్డ భాగాన్నే అద్దెకు తీసుకున్నాను. ఆ పక్క భాగంలో ముసలి ఇంటాయనా, ఇంటావిడా మాత్రమే ఉన్నారు.

ఆ ఊరు గొప్పదనేందుకు వీల్లేదు. కొంచెం పెద్ద జీతపు ఉద్యోగస్తుణ్ని అవటంవల్ల ఆఫీసులో పని తక్కువ. మిగతా కాలాన్ని ఇంటెడు సామాను మధ్యా ఆవలింతలతోనూ కునికిపాట్లతోనూ గడపాల్సి వచ్చింది. నా సంస్కారానికి సరిపడే వ్యక్తి లభించక పోవటంవల్ల చెప్పుకోదగ్గ స్నేహితులు కూడా లేరు.

ఎలాగో మొదటి నెల గడిచింది.

ఆ రోజు ఉదయాన నిద్రలేచి దొడ్డి తలుపు తెరిచేప్పటికి నూతి దగ్గర బట్టలుతుకుతూన్న పద్దెనిమిదేళ్ళ పడుచు, నా నిద్రమత్తును పూర్తిగా వదలకొట్టింది. ఇంతకుపూర్వం ఆ ఆవరణలో ఇలాటి సౌందర్యరాశిని చూడకపోవటంవల్ల కనీసం ఆమె ఎవరైవుంటుందోనన్న ప్రశ్న బలమైంది. నన్ను చూసి ఇతర సంసార స్త్రీలలాగే ఆమెకూడా తలవంచి సిగ్గును గొప్పగా నటిస్తూ పరుగెత్తుతుందనుకొన్నాను. కాని అల్లాటిదేమీ జరగకపోగా నన్నొక నిమిషం తేరిపార చూసి నవ్వి పురుషుడెవడూ ఆవరణలో లేనట్టుగానే తన పనిలో నిమగ్నమయింది. సరిగ్గా కీచకుడు సైరంధ్రిని చూసిన క్షణంలో పడ్డ అవస్థ అంతా నాకు వర్తించింది. అసలు ఇంత నిర్లక్ష్యాన్ని చూపబట్టే నన్ను ఆమె విచిత్ర మార్గంలో ఆకర్షించిం దనుకుంటాను. విశేషించి సౌందర్యారాధకుల లిస్టులో నా పేరు ఇదివరకే జమపడటం వల్ల నిండు యవ్వనంతో

పొంగిపొరలుతూన్న ఆమె సౌందర్య మూర్తి నన్ను తనతో పాటు మరొక మెట్టు పైకి లాగింది.

ఐదు నిమిషాలదాకా నేను అక్కణ్నుంచి కదలకపోయినా ఆమెలో ఎట్టి చలనమూ లేదు. పొద్దున్నే లేచి ఇంత మంచి ముఖాన్ని చూడటంలో ఎంత తృప్తి వుంది! దేవుడు చప్పున ప్రత్యక్షమై 'నీ కేం కావాలీ?' అంటే ఆమె వైపు చూపటం కన్న నేను చెయ్యగలిగిందేముంటుంది? అసలు మంచి భార్యలు దొరకలేదని అసంతృప్తితో నాలాగు జీవితాన్ని నెట్టుకొనేవాళ్ళకు ఇట్లాంటి అందమైనది కన్పిస్తే ఇంకెన్ని భావాలు రేకెత్తుతయ్యో?

మరి కొంతసేపు అక్కడ నిలబడేందుకు మనస్కరించలేదు. ఎవరైనా చూస్తే నా ఉద్యోగపు హోదాకూ నా గౌరవానికీ చిన్న గాయం ఏర్పడక మానదు. మెల్లిగా లోపలికి వచ్చి పక్కమీద పడుకున్నానన్నమాటేకాని ఆమె ఎదుటలేని క్షణాలన్నీ వృథాపోతున్నయ్యనే ఆవేదన కలిగింది. ఆడది ఆమెకు లేని సిగ్గు నాకేంటి? అందులోనూ సంస్కరణ రసం బాగా వంటపడుతూన్న నా లాటి నవయువకుడిలో ఇలాటి నీచాభిప్రాయమేమిటి? ఆమెలాగే మన పనిని మనం చేసుకుంటే పొయ్యేదేముంది? మా ఇంటి వారు వృద్ధులవటం కూడా అనుకూలమేగా! ఐనా నాలో వున్న సంస్కారం ఇతరుల్లో లేదని అభిప్రాయపడుతూన్నన్నాళ్లూ వెధవభయం కాస్తో కూస్తో బెదిరిస్తూనే వుంటుంది!

ఇంత తర్కించుకొనేదాకా ఆ కోర్కె ఆగిందీ? వెళ్ళి దొడ్డి గుమ్మానికి ఒక భుజాన్ని మోపి, అరమోడ్పు కన్నులతో ఆమె వైపు ఆశగా చూశాను... మళ్ళీ తలెత్తి నవ్వింది. ఆ అందాల బరిణె నవ్వుతూ ఎదురుగా కూర్చుంటే ఎన్ని రోజుల్ని గడపకూడదు?

అదేమి చిత్రమో కాని ఆమెను చూసింది మొదలూ అంతులేని ఆశలు నాలో బయలుదేరినయ్. ఇదివరకు మనసులో పని చేస్తూ అందకుండా బాధించే సుందరాంగుల చిత్రాలన్నీ మాసిపోయి వాటి స్థానే యీమె ఒక్కతే తన ఛాయను లోతుగా పాతుకుపొయ్యేట్టు చేసుకోగలిగింది! పత్రికల్లో పడే బొమ్మల్ని చూసి అనేక ఆశాసౌధాల్ని కట్టుకొనే బుద్ధిమంతులకన్న నేను మరొక మెట్టు పైనే వున్నానేమో? జీవితమంతా కాకపోయినా కొన్ని రోజుల పాటైనా ఆమె నాదైపోతే ఎంత బాగుండును! అందుకు తగ్గ యోగ్యతలు నా దగ్గర ఏమున్నయ్యో నాకు తెలియదు. అసలు అనర్హుణ్నేమో? కోర్కెకూ అర్హతకూ అనాదినుంచీ భూమ్యాకాశాలకున్న దూరం వుండనే వుందిగా! ఇన్ని కోర్కెలు ఇంత కొద్ది కాలంలో ప్రబలేందుకు గల కారణాలు మాత్రం ఎవరు చెప్పగలరు?

నాకు నూతితో అవసరం ఉన్నట్టు భావించి కాబోలు- గిరుక్కున తిరిగి వెళ్ళిపోతోంది. ఆ నడకలో ఎందరెందరు దేవకాంతలు స్ఫురించారు! ఆ విసురుకు రాత్రల్లా తలలో సుఖంగా నిద్రపోయి నలిగిన గులాబి పువ్వు కిందపడ్డది. వెంటనే

దాన్ని తీసుకుని వాసన చూడసాగాను! ఒక్కసారిగా ఆమె వెనక్కు తిరిగి నా ప్రవర్తనను ఒక్కక్షణం చూసి నవ్వి వెళ్ళిపోయింది. నాలో నేనే సిగ్గుతో కుంగిపొయ్యాను! ఎక్కడో కథల్లో జరిగేలాటి సంఘటనతో ఎంత లోకువయ్యాను! ఏమనుకుందో?--

ఆ పగలల్లా ఆఫీసులో ఆమెనుగూర్చిన ఊహలే నాలో పనిచేసినై. ఆమె మూర్తినీ, నవ్వునూ, ఆ పెద్దకళ్ళనూ తలచుకొని బాధపడ్డాను! ప్రియురాలు లేకుండా కథల్లో సృష్టించుకొన్న ప్రియురాళ్లతో సరససల్లాపాలాడి కోర్కెల్ని తీర్చుకొనే మహానుభావులూ, ఫిలిం ఇండియాలో బొమ్మల్ని దీక్షగా చూస్తూ రాత్రి కలలో దర్శన మిచ్చిన నటితో అసంతృప్తిపడే కుర్రకారూ నాలాగే అవస్థపడతారు కాబోలు! ఊహలో కోర్కెల్ని తీర్చుకొనే అనుభవమూ, తృప్తీ నాకు అలవాటుపడకపోవటం మహాయిబ్బందిగా తోచింది.

## 2

సాయిత్రం ఆఫీసునుంచి వస్తున్నాను. ఆమె దొడ్డి గుమ్మం దగ్గర నిలబడి విలాసంగా వీధిలోకి చూస్తోంది. బజార్లో ఆమెను చూస్తూండటం పరాయి కళ్ల పడితే బాగుండదని లేని నిగ్రహంతో నా దారిన నేను వెళ్తున్నా... ఎప్పుడు వచ్చిందో నా దారికి అడ్డం వచ్చి చిన్న చీటీని నా కాళ్ళ ముందు పడేట్టు విసిరింది. ఆశ్చర్యంతో 'ఏమిటిది?' అన్నట్టు చూశా. చూపుడు వేలుతో ఆ కాగితం ముక్కను చూపి, నవ్వి పారిపోయింది. ఇటూ, అటూ ఎవ్వరూ లేనందుకు అదృష్టవంతుణ్నే ననుకుంటూ ఆ కాగితాన్ని భద్రంగా తీసుకొని చరచరా వెళ్ళి గది తలుపు బిగించి, చీటీని విప్పాను. 'రాత్రి పదకొండింటికి వస్తాను--తలుపు దగ్గరేసి ఉంచండి' ఉన్నవి- రెండు వాక్యాలే అయినా ఆ ప్రేమలేఖ ఎంత బాగుందీ! ప్రేమలేఖల పేరిటా, స్నేహలేఖల పేరిటా దిగుమతయ్యే మన సాహిత్యంలోని చెత్తంతా చదివినా యీ బుల్లి లేఖను చదివినంతగా ఆనందించలేను!

ఎంత ధైర్యం చేసింది! 'రొమాన్సు' ఇంత తేలిగ్గా దొరుకుతూంటే జీవితంలో ఎంత మాధుర్యం ఏర్పడుతుంది! పురుషుణ్ని- పర స్త్రీని తేరిపార చూసేందుకే నాకు కాళ్లు వొణుకుతయ్! కాని ఆమె 'సాహసం;' స్త్రీ మూర్తిలో ప్రతిఫలించిన గుణాల్లో ఒకటేమో?

ఇంత సులభంగా ఆమె నాదైపోతుందని కలకన్నానా? నన్ను నేనే నమ్మేందుకు కూడా వీలులేనంత పని జరిగింది! ఇంత అందమైన స్త్రీ తనంతట తను ఎదుట మోకరిస్తే ఏ పురుషుడికి గర్వంగా ఉండదు? శీలమని పట్టుకొని వేళ్లాడేందుకు నాలో అమానుషత్వం ఎక్కడా లేదు!

ఆ లేఖను లెక్కలేనన్నిసార్లు చదువుకొన్నాను. ఆ రెండు వాక్యాల్లోనే ఆమె నా ఆశాజ్యోతులన్నింటినీ వెలిగించి నా జీవితపు రహదారిలో విద్యుద్దీపాల కాంతిని

ప్రసరింపజేసిన దేవకన్య! ఇంత సులభంగా తీరే కోర్కెలతో నిండిన జీవితానికి బాధ ఎందుకుంటుంది? నా ప్రతిబింబంలో ఇన్నాళ్ళూ నాకు కన్పించని గొప్ప అందం స్ఫురించింది.

మరి కొన్ని గంటల్లో నా దగ్గర, నాతోపాటు నవ్వుతూ తన ఆనందంలో నాకు సగపాలును ప్రసాదిస్తుంది!... ఆ క్షణాలు త్వరగా వస్తే బాగుండును! ఒక కోర్కెకు ఇంకెన్ని కలుస్తయ్యో ఊహించటం కూడా కష్టమేనేమో?

ఆ సంతోషంలో అన్నం కూడా సరిగ్గా సయించలేదు. కడుపు నిండినట్టుగానే తోచింది. త్వరగా ఇంటికి వచ్చి మరోసారి నా అదృష్టాన్ని నాలో నేనే పొగడుకుంటూ మంచం మీద వాలాను. ఎంతకూ పదకొండు కాదు. కాలం విలువ గ్రహించలేనివాళ్ళకు ఇలాటి సంఘటనలు బాగా బోధపరుస్తాయ్! అనేక విధాలుగా ఆలోచిస్తూ ఆ గంటకోసం ఎదురు చూస్తున్నాను.

క్రమంగా పదకొండు అయింది. నా ఆతృత కూడా అధికమైంది. ఆ క్షణాల మీద పెట్టుకొన్న ఆశ నన్ను నేను మరిచేట్టు చేస్తోంది...కాని ఆమె రాలేదు. గాలికి తలుపు చప్పుడై వస్తోందన్న భ్రమతో లేచి కూర్చుంటున్నాను. ప్రకృతి శక్తులన్నీ కలిసి మానవుణ్ని ఎలా ఏడిపించగలవో అర్థమౌతోంది.

మరొక అరగంట కూడా గడిచింది. అనుకున్న పనులు సమయానికి కాకపోతే మాత్రం కాలం ఎందుకు ఆగుతుంది? మరిచిపోయి నిద్రపోయిందా? హృదయపూర్వకంగా వలచి తనకు తానై ఆహ్వానించిన స్త్రీ అలాటి పనిని ఎందుకు చేస్తుంది?

పన్నెండు కూడా అయింది! భరించలేని క్షణాలు ఒకటొకటిగా సాగిపోతున్నయ్. ఒక పక్కన నిరాశ కూడా కలుగుతోంది. నన్నూ నాలాటి నీచభావాలవాళ్ళనూ ఏడిపిద్దామని బయలుదేరిన మహాపతివ్రత కాదుగదా? మరొక గంట గడిచేప్పటికి నా బాధ మరీ అధికమైంది. తలుచుకుంటే బావుర్న ఏడవాలనిపించింది. నన్ను ఇంతగా బాధించిన ఆమె- రావాలి, ఆ మెత్తని బుగ్గల్ని పిండి, ఇలాటి పనిని మరిముందు చెయ్యకుండా ఒట్టు వేయించుకొని...అసలు వస్తే కద?

ఎంత ఓపిగ్గా జాగారం చేస్తున్నాను! బైట కాస్తూన్న వెన్నెల నా అవస్థ చూసి ఫక్కున నవ్వుతూన్నట్టుగా వుంది! ఆమె వస్తే ఎలా ప్రవర్తించాలోనని ఊహిస్తూనే ఎల్లాగో కాలక్షేపం చేశా... వస్తుందేమో? ఇంకెప్పుడు? తెల్లారిపోవటంలా?

రెం-డు! రెండో ఆటకు సినిమాకు వెళ్లినా ఇంత ఓపిగ్గా కునికిపాట్లు పడకుండా కూర్చోగలనా? వెధవ ఆశ మానవుడిచేత కష్టమనీ, ఒక్కొక్కప్పుడు అసాధ్యమనీ తలచిన పనుల్ని కూడా అతి సులభంగా చేయించగలదు కాబోలు!

మూడు గంటలు కూడా దాటుతోంది. ఇంకో రెండు గంటల్లో భళ్లున తెల్లారుతుంది. ఈ రాత్రల్లా నిద్ర లేకపోవటంవల్ల రేపు ఆఫీసులో చెయ్యి విరిగిన కుర్చీలో ఎర్రని కళ్లతో కునికిపాట్లు పడుతూండటమూ ఇది చూసి మిగతా గుమాస్తాలు చాటుగా నవ్వు కోవటమూ గుర్తొస్తోంది! ఇక ముందు ప్రియురాళ్ల కోసం తహతహపడకుండా మెత్తని చెప్పుతో బుద్ధి చెప్తున్నట్టుంది! అసలు ఆమె కన్పించకుండా వుంటే నా మనశ్శాంతికి ఇంత భంగం వాటిల్లేదే కాదు. చెప్పుకొనేందుక్కూడా సిగ్గయ్యే అవస్థలో పడ్డాను!

మూడున్నర కూడా అయింది. నిరీక్షణలో ఎన్ని రోజులు గడిచిపోతయ్యో ఊహించలేకుండా ఉన్నాను. వీధి భాగోతానికి వెళ్లినా ఇంత బాధపడే వాణ్ని కాదు. నిరాశతో ఇంక తలుపు వేద్దామని లేవబొయ్యాను...ఆమె మెల్లిగా తలుపు నెట్టుకొని ప్రవేశిస్తోంది...నిద్రమత్తంతా వదిలేట్టు కళ్లు నలుచుకొన్నాను. ఎల్లాగైతేనేం వచ్చింది! 'ఆశ' 'నిరాశ'ను ఎగతాళి చేస్తోంది! ఇందాకట్నుంచీ వస్తూన్న కోపం సగం చల్లారింది.

తలుపు గడియ వేసి శోభనపు గదిలో ప్రవేశించే వధువులాగ మెల్లిగా వస్తోంది. ఇంత రాత్రి వరకూ నిద్రావస్థలో వున్నా, జాగ్రదావస్థలో ఉన్నా ఆమె ముఖంలో ఏ విధమైన బడలికా కన్పించటం లేదు. నాకు దగ్గరగా నిలబడి, బొటనవేలు నేలరాస్తూ, నేలచూపుల్ని చూస్తోంది. చెయ్యి పట్టుకొని మంచం మీద కూర్చోపెట్టాను.

"భలేదానివి--మీ గడియారంలో ఇప్పుడెంతయింది?"

నా చేతి గడియారాన్ని తను చూసి నాకు చూపుతూ "ఇదేగా మా గడియారం?" అంది.

"ఐతే ఇప్పుడు పదకొండేనా అయింది?"

"అందరూ నిద్రపొయ్యేదాకా ఉండొద్దూ?"

ఆమెలాటి సంసార స్త్రీకి అనేక ఆటంకాలుంటయ్యనీ, వాటితోపాటు నేను మరికొన్నింటిని కూడా కల్పించుకొని ఆ కారణాలతో తృప్తిపడి- ఆమె ఆలస్యాన్ని క్షమించాను:

"నీ పేరేంటీ?"

పేరైనా తెలుసుకోకుండా ఇలాటి రంగాల్లోకి దిగటం ఆశ్చర్యకరమైందే! కాని ఇలాటి సంఘటనలు జీవితంలో ఏ కొందరు అదృష్టవంతులకో తగుల్తుంటాయి.

"మీకు నా పేరుతో ఏం పనీ? నేనేగా మీకు కావాల్సింది?"

నిజమే! 'సుందరి' అనే పేరున్న వాళ్ళు చూసేందుకు వికారంగా ఉండటాన్ని నేను ఎరుగుదును. ఏమైనా ఆమె పేరు వినాలనే కుతూహలం తగ్గలేదు.

"నువ్వూ కావాలి--నీ పేరు కూడా కావాలి--"

తలొంచుకొని, "శశిరేఖ" అంది.

"మీ వాళ్లు నీకు పేరుపెట్టటంలో ఏమీ అన్యాయం చెయ్యలేదు--" నవ్వింది; తనతో నన్నూ కలుపుకుంది.

ఈ సంభాషణతో ఇంకా మిగిలివున్న కొద్ది కాలాన్నీ వృథా చేస్తున్నానని మనస్సు అలారం కొడుతోంది. ఆ మిగిలిన రాత్రంతా శశి చేతుల్లో శిశువునయ్యాను!

## 3

ఇలాగే ప్రతిరోజూ వస్తానని వాగ్దానం చేసింది. ఇలాటి సౌందర్యవతి కోసమైనా ప్రకృతి రోజుకు రెండేసి రాత్రుల్ని ప్రసాదిస్తే ఎంత బాగుండును!

ప్రతిరాత్రీ మూడున్నరదాకా, కళ్లల్లో ఒత్తులు వేసుకొని ఆ స్వర్గ సౌఖ్యాన్ని తల్చుకొని లొట్టలు వేసుకుంటూ అవస్థపాలవుతూనే వున్నా. ఎటూ కాని దొంగవేళ మూడు దాటాక రావటమేమిటి? ఆమె పరిస్థితులు అల్లాటివి! ఆమెను కోరాక చచ్చినట్టు నా పరిస్థితుల్ని కూడా మార్చుకు తీరాలి.

ఐనా మూడో రాత్రి గట్టిగా చెప్పాను: "ఇది చాలా అవస్థగా వుంది...రాత్రల్లా నిద్రమేలుకుంటే ఆరోగ్యం చెడదూ?"

"అంతకన్న గత్యంతరం లేదు--" ఇంక బెట్టుచేస్తే ఈ వచ్చింది కాస్తా జారుతుందేమోననే భయంతో కిక్కురుమనలేదు.

రెండు వారాలు గడిచినై. రోజూ మధ్యాహ్నం ఆఫీసులో ఎలాగో ఒక కునుకు తీస్తూనే వున్నా. తలుపు దగ్గర వేసినప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకొని ముందు ఇంటికి కాపలాకాయకపోతే ఈ పదేళ్ళనించీ కష్టపడి సంపాయించిన సామాను కాస్తా దొంగలపాలవుతుందేమోననే భయమూ; ఒకవేళ తలుపు వేసి నిద్రపోతే ఆ సౌందర్యవతిలేని ఒక రాత్రి జీవితంలో వృథాఐపోతుందనే ఏడ్పూను.

ఆ రాత్రి -- గడియారాన్ని చూసి అంది: "అమ్మో! ఐదైంది. ఇక వదలండి --వెళ్ళాలి. ఇప్పటికే చాలామంది లేస్తారు--"

"మరి నువ్వు ఆలస్యంగా వచ్చినందుకు శిక్షో?"

"తరువాత చూద్దాం. మరి నేను మీకు ఇంత ఆనందాన్ని ఇచ్చినందుకు బహుమతో?"

ఆనందం ఇవ్వలేదని ఎల్లా అనగలను?

"ఏం కావాలీ?" అన్నా గర్వంగా 'మననేం అడగొచ్చిందిలే' అనుకుంటూ.

"ఇస్తారా?" అంది.

కొంచెం బెరుకుపడ్డా, "ఆఁ కోరుకో--" అన్నా--వరాలిచ్చే భగవంతుడి పోజు వేసి!

ఒంకెను తగిలించిన కోటు జేబులోంచి పర్స్‌తీసి, "ఇది--" అంది.

ఒక్కసారి చిరుచెమట్లు పోసినై. కిందటి సాయింత్రమే తీసుకొన్న జీతం డబ్బులూ, వసూలైన ఇతర మామూళ్లూ ఆ పర్స్‌లోనే ఉన్నై. నన్ను ఉన్నపళంగా కొనాలంటే ఆ పర్స్ విలువకన్న ఎక్కువ విలువను ఎవ్వరూ ఇవ్వరు. ఆమెకు ఎందుకు వాగ్దానం చేశానా అనిపించింది. ఇప్పుడు 'ఒద్దు' అనేందుకు వీల్లేదు. సాక్ష్యాలు లేక కొట్టివెయ్యబడే కోర్టు కేసుల్లాగే దీన్ని కూడా ఉపసంహరించుకుంటే ఆమెకూ నాకూ మరి జీవితంలో సంయోగం ఉండదు. దీన్ని కోరే నా రక్తం, ఆత్మాభిమానాన్ని తోడుతెచ్చుకొని 'ఏం చేస్తావ్?' అంటోంది.

నవ్వుతూ ఆ పర్స్‌ను ఎగరేసి పట్టుకొని, "ఎంతకైనా మీ అవసరం తీరేదాకానేగా పై మాటల్తో ఊరించటం! తీసుకోండి--" అని పర్స్ నా మంచం మీద పడేట్టుగా విసిరింది. కొన్ని క్షణాల్లోనే ఆమె ముఖాన్ని ప్రణయ కోప ధూమాలు ఆవరించాయి.

పాపం! ఎంత నొచ్చుకుందో? అడిగి లేదనిపించుకోవటంకన్న చిన్నబోవటం లేదుగా! నిరాకరణలోని బాధను నాకు కనబడకుండా చెయ్యాలని ప్రయత్నిస్తోంది కాబోలు! నిజమే- ఎంత ఆనందాన్ని ఇచ్చింది! కాని పర్స్‌లో ఉన్న మూడొందల రూపాయిలు! కామాన్ని ఇంత విలువకు ఇదివర కెప్పుడూ నేను కొనలేదు; కొనదల్చుకోనూలేదు. కాని కామాన్ని విలువకట్టే అధికారం ఎవరికుంది? ఒక్కొక్క భోగందానికోసం వేలరూపాయిల ఆస్తుల్ని తగలేసిన పెద్దమనుషులు నాకు జ్ఞాపకం వచ్చారు. ఈ సమయంలో ఇంత ప్రియమైన ధరకు యీ కామాన్ని కొన్నా, వారికన్న ఏ విధంగానూ పెద్ద 'బుద్ధిహీనుణ్ణి' మాత్రం అవను. అసలు ఇంత డబ్బు ఆమె కోరుతుందంటే వ్యవహారాన్ని ఇంతదూరం రానిచ్చేవాణ్ణి కాదు!

"సరే--నే వెళ్తున్నా--"

లేచి రెండడుగులు ముందుకు వేసింది. నాలో ఉన్న ప్రకృతి శక్తులన్నీ కలిసి ఆమె వైపు పనిచేసినై. వెంటనే వెళ్ళి ఆమె చేతిని పట్టుకొని, లేని నవ్వును కల్పించుకుంటూ, "ఎందుకూ అంత కోపం?" అన్నా.

"కోపమేముందీ? మామూలు వేళకే వెళ్తున్నాను--"

"వెళ్తేవెళ్లు, కాని ఆ పర్స్‌ను కోరావుగా, దాన్ని తీసుకువెళ్లు" అని బలవంతాన పర్స్‌ను చేతులకు అందిచ్చా.

"నిజంగానే ఇస్తున్నారా?" అంది.

"హృదయపూర్వకంగా-" అన్నాను- బాహ్యరూపాన మోదంతోను, అంతర రూపాన ఖేదంతోనూ. ఇలాటి నాటకాలు నేర్చుకోవాల్సిన అవసరం తెలుస్తోంది.

ఏమనుకుందో కాని నవ్వుతూ వెళ్ళిపోయింది. ఇదివరకు 'వెధవ డబ్బు' మీద కొట్టిన లెక్చర్లన్నీ తలపుకు వచ్చినై. మిగతా రాత్రిని బాధతోనే గడిపా. కాని శశిలాటి స్త్రీకి ఈ కాస్త డబ్బు ఇవ్వటంలో పెద్ద గొప్పేమీ లేదనే సమాధానంలో కొంత తృప్తి కూడా లేకపోలేదు!

నెలలో మిగిలిన రోజుల్లో ఒళ్ళు దగ్గర పెట్టుకొని చచ్చినట్టు ఖర్చు తగ్గించుకొన్నాను. నిద్ర సరిగ్గా లేకపోవటంచేత ఆరోగ్యంలో కూడా భేదం కన్పిస్తోంది కాని లెక్కచెయ్యలేదు- ఎందుకంటే ఏదీ ఖర్చవకుండా మంచి అనుభవం జీవితంలో అసంభవం కనుక!

## 4

అసలు మొదటిసారితోనే బుద్ధి రావాల్సింది; కాని ఏ నక్షత్ర బలం చేతనో, లేక నా దురదృష్టంచేతనో రెండో నెల జీతం కూడా ఆమె పాలే అయింది. 'నాకు ఇంక డబ్బులేద'నటం నాలాటి గొప్పవాడి ఆత్మగౌరవానికి భంగంగా తోచింది!

'జమ రొక్కం' కింద దమ్మిడీ అయినా కన్పించకపోయినా, పెద్ద ఉద్యోగస్తుణ్నవటం వల్ల ఏ అప్పులవాడూ ధైర్యంచేసి వెంటపడలా. ఆ మేకపోతు గాంభీర్యంతోనే మరికొన్ని సౌఖ్యాల్ని కూడా వదులుకొని తిరగసాగాను. ఆమెతోడి ఆనందంకోసమే ఇవన్నీ త్యాగం చేశా.

ఆదివారం మధ్యాహ్నం తీరిగ్గా పడుకొని కునుకు తీస్తున్నా. ఎవరో తట్టి లేపారు. తొందరపాటుతోనే లేచాను.

"శశీ!"

తలొంచుకొని, "ఊఁ" అంది.

రాత్రి రెండు, మూడూ కానిదే నన్ను దర్శించలేని అబల యీనాడు మట్టమధ్యాహ్నం-- నా ఇంట్లోకి ఎలా ప్రవేశించిందో ఆశ్చర్యంగానే వుంది!

"ఎవరైనా చూస్తే?"

"ఏం చూస్తే?"

ఆమె ధైర్యానికీ, నా పిరికితనానికీ సిగ్గేసింది. "మరి రాత్రిళ్ళు...రెండైనా కానిదే వచ్చేదానివి కాదుగా?" అన్నా.

"నీళ్ళల్లో దిగదల్చుకున్నవాడికి లోతుతో పనేమిటి?తీరా మునిగాక చలేమిటి? నేను రావాలనుకున్నాక నాకేం భయం?--"

మళ్ళీ సిగ్గుపడి కూడా, "మరి భయం కాక--?" అన్నాను. నవ్వింది-- నా తెలివితక్కువకేమో?

"అవును. రాత్రి తొమ్మిదింటికే భోజనాలు చేసి తీరిగ్గా తేపుకుంటూండగా వచ్చే భార్యల్లో మీకేం ప్రత్యేకత కన్పిస్తుంది? రమ్మనంగా వస్తూ, పొమ్మనంగానే పోతూ, ఆజ్ఞల్ని శిరసావహించే యీ ప్రాణం వున్న రబ్బరు బొమ్మల్లాటి భార్యల్ని అనుభవించటం మాత్రమే తెలిసిన మీకు కష్టపడి సంపాయించే ప్రియురాలి కౌగిట్లోని సౌఖ్యం అర్థమవొద్దూ? నేనూ మీ భార్యలాగే ప్రవర్తించినట్టయితే నాలో విలువ మీకేం తెలుస్తుంది? మీరు భార్యను చూసే దృష్టితోనే నన్ను కూడా చూసేవాళ్ళేగా!"

నాలో ఇదివరకు లేని ఆలోచన రేకెత్తింది. నిజమే! ఆమె చెప్పింది కాచివడబోసిన సత్యం! నిరీక్షణలోని మాధుర్యాన్ని నాకు తెలియపర్చింది, ఇదివరకు యీ కీలకం తెలియక, ఆమెను తిట్టుకొనేవాణ్ణి. ఆమె త్వరగా వస్తే ఎంత రంగం పాడయ్యేదో! అప్పుడు ఆమెను చులకనగా కూడా చూసేవాణ్ణి! బెట్టుసరిలో ఉన్న పసందు ఇప్పటిక్కాని నా బుర్రకు ఎక్కలేదు. ఇదివరకే యీ సంగతి తెలిసినట్టయితే-- ఇంత అనుభవం ఉండేది కాదేమో?

"నేను సాయింత్రం వెళ్లిపోతున్నాను--" చూపులు తిప్పేసుకొని మాటల్ని నేర్చుకొనే పిల్లకుమల్లే అంది.

"ఎక్కడికీ?" అన్నా ఆతృతగా.

"అత్తవారింటికి-" ఆమె పరాధీన! ఏ అదృష్టం వల్లనో నాకు కొన్నాళ్ల పాటు ఎవరి కళ్ళాపడకుండా ఆనందాన్నిచ్చింది. నేనూ పరాధీనుణ్నే కనుక ఆమెను ఎల్లకాలమూ కోరలేను! కోరినా ఎలా చెల్లుతుంది?

"మళ్ళీ ఎప్పుడొస్తావ్?" అన్నా, ఇంత మంచిపిల్లను పోగొట్టుకుంటున్నానే అన్న దుఃఖంతో.

"ఏమో ఎప్పుడొస్తానో- అసలు రానేమో కూడా-!" నవ్వింది-- పేలవంగా! ఈ విరహం ఆమెకు యేమీ కష్టంగా లేదు కాబోలు! నాకెల్లావున్నా మౌనంతో అనుభవించాల్సిందే!

పమిటలో దాచిన పర్స్‌ను తీసి నాకు ఇవ్వొచ్చింది. ఒక్కసారిగా ప్రాణం లేచి వొచ్చినట్టయింది. కాని, వెంటనే దానికోసం చెయ్యి జాపుతే ఆమె దృష్టిలో నేనెంత అల్పుణ్ణవుతాను?

"నీకు కావాలని తీసుకొన్నావుగా--?" అన్నా.

"నా కెందుకూ? డబ్బులేందాన్ని కనకనా?"

"మరి--?" అన్నా ఆశ్చర్యంగా.

"కామానికి విలువ తెలియక పోతే అది మీ దృష్టిలో ఎంత నీచమవుతుంది? అసలు బోగంవాళ్ళు విటుల్ని ఆకర్షించేందుకు ఇదే ప్రత్యేక కారణంగా తోస్తోంది.

డబ్బిచ్చి కొనుక్కొన్న దానికి ఎంత విలువ ఉంటుంది! అప్పుడే మీరు దాన్ని బాగా అనుభవించగలుగుతారు. మిమ్మల్ని కోరే నేను కూడా తృప్తిపడతాను. నాలోని ఆకర్షణ చెడకుండా యీ పన్నాగం పన్నాను."

నవ్వాలో, ఏడవాలో తెలియలేదు! ఆమెను ఎంత తప్పుగా అర్థం చేసుకొన్నాను! ప్రియురాలి మాధుర్యాన్ని ఆమె నాకు చూపినట్టు ఇంకొకరు జీవితంలో చూపగలరని ఏ విధంగా నమ్మగలను? ఆదర్శ ప్రియురాలు!

"తీసుకోండి--నేను వెళ్ళాలి--"

"ఇచ్చింది--తీసుకోవటం--?"

నా మాటకు అడ్డువచ్చి, "ఫర్వాలేదు. పోనీ నేనే మళ్లీ తిరిగి ఇస్తున్నానుగా!" అని, నా సమాధానాన్ని కూడా వినిపించుకోకుండానే పర్స్‌ను నా చేతులో వుంచి వెళ్లిపోయింది. కొన్ని నిమిషాల వరకూ ఎక్కడ వున్నానో తెలియలేదు.

తరువాత పర్స్ తీసి చూస్తే వెయ్యి రూపాయిల కరెన్సీ నోట్లున్నయ్; మరొక లేఖకూడా వుంది.

"నాలు గొందల రూపాయిలు ఎక్కువ ఇస్తున్నాను. నన్ను మీరు అనుభవించినందుకు ఆరొందలు ఇచ్చారు. మిమ్మల్ని నేను అనుభవించినందుకు నాలుగొందలు ఇస్తున్నాను. ఇది మీకు ప్రతిఫలం--!"

ఎంత ఎకానమీ ఏడ్సినా జీవితంలో ఇంత డబ్బును ఒక్కసారిగా చేత పట్టుకుంటానని కలలో కూడా అనుకోలేదు. శశిని గూర్చిన ఆలోచనలతోనే ఇంటి దూలాల్ని లెక్కపెడుతూండగా మా ఆవిడ వచ్చింది!

"ఈ బండికే వొచ్చావా?"

"ఊఁ." అంది, స్టేషన్‌కు రాలేదన్న కోపంతో!

బిడ్డను పడుకోపెట్టి, త్వరత్వరగా వచ్చి పక్కమీద పడివున్న పర్స్‌ను తీసి, డబ్బును లెక్కపెట్టి, తృప్తిగా, "ఇంత డబ్బు ఎక్కడదండీ?" అంది.

"ఈ రెండు నెలలూ, రాత్రిళ్లు కూడా పనిచేసి సంపాయించాను--"

"అయితే యీ నెలలో నాకు కాసులపేరూ, కుర్రాడి మెళ్ళోకి గొలుసూను!"

కష్టపడి సంపాయించేదొకరైతే ఆ ఫలితాన్ని అనుభవించే దొకరు! ఈ రకం ఆలోచనలతోనే ఉత్తరీయం వేసుకొని వీధిలో పడ్డాను!

- ఆగష్టు, *1941*